క్లుప్తంగా

ఓటర్ల సర్వే పారదర్శకంగా ఉండాలి



నేలటూరులో సర్వేపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

కపిలేశ్వరపురం: ఓటరు జాబితా ముసాయిదా తయారీ పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని నేలటూరు, వల్లూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వే ప్రక్రియపై సచివాలయంలో కార్యదర్శి రామకృష్ణ, ఉద్యోగులతో ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ సూర్యారావు చర్చించి పలు సూచనలు చేశారు.

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామికి బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలబాలాజీ ఆధ్వర్యంలోని వేద పండితులు స్వామికి అభిషేకం చేశారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, వెదురుమూడి, కోరుమిల్లి గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారురాలికి పింఛన్ సాయం అందిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఆపదలో ఉన్న వారికి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎం.నాగమణికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేల పింఛన్ సాయాన్ని బుధవారం కౌన్సిలర్ మందపల్లి రవికుమార్‌తో కలిసి చైర్‌పర్సన్ దుర్గారాణి అందజేశారు. నాగమణి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పింఛన్ మంజూరుపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నాగమణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మందపల్లి సుధాకర్‌రావు, కొల్లి సత్యనారాయణ, మందపల్లి సతీష్, జొన్నాడ నగేష్,, చంద్రమళ్ల సత్య సురేష్, పాపగంటి మణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల్లో డాక్టర్ వీరభద్రుడు తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ హరీష్ ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టతలను గురించి తెలియజేస్తామన్నారు. పుట్టిన ప్రతి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలే దివ్య ఔషధమన్నారు. తల్లులు బిడ్డ పుట్టినప్పుడు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమంత్ చక్రధర్, పీపీ యూనిట్ భగవాన్, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దూర విద్యా కోర్సులకు గడువు పొడిగింపు

రామచంద్రపురం: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ దూర విద్యా కోర్సులకు గడువు పెంచినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దూరవిద్యా విధానంలో డిగ్రీ, పీజీ కోర్సులు అభ్యసించాలనే ఉద్యోగస్తులకు, గృహిణులకు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్న వారికి మోడరన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ద్వారా దూర విద్యా విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ పి.సత్యనారాయణను సంప్రదించాలని, లేదా 92931 64798, 08857 242489 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేరాలపై నిఘానేత్రం

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న పోలీసులు
- దాతల సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- నేరస్తుల పట్టివేతలో సత్ఫలితాలు



రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి గ్రామాల్లోని కూడళ్ల వద్ద కదలికలు పరిశీలిస్తున్న ఎస్ఐ శివకృష్ణ

మండపేట: నేరాల కట్టడిలో పోలీసు యంత్రాంగం సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. తద్వారా సత్ఫలితాలను సాధిస్తోంది. దాతల సహకారంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద అధునాతన హెచ్‌డీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరస్తులు, ఆకతాయిల భరతం పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని మండపేట రూరల్ పోలీసులు చెబుతున్నారు.

నేరస్తులను గుర్తించడంలో..

నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలది కీలక పాత్ర. ఎక్కడ ఏ నేరం జరిగినా పోలీసులు మొదటిగా పరిశీలించేది ఘటన స్థలం దగ్గర్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలనే. వాటి సాయంతో నేరానికి పాల్పడిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకుంటుంటారు. నేరాల కట్టడిలో ప్రధాన భూమిక పోషిస్తున్న సీసీ కెమెరాలను గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటుకు కృషి చేస్తున్నారు రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ. మండలంలో ఇప్పటికే ద్వారపూడిలో పంచాయతీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా తాపేశ్వరం తదితర గ్రామాల్లో దాతల సహకారంతో మెయిన్ సెంటర్లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. నైట్ విజన్ కూడా క్లియర్‌గా కనిపించేలా హై రిజల్యూషన్ కలిగిన హెచ్‌డీ క్వాలిటీ కెమెరాలను వినియోగిస్తున్నారు. నగరాల్లో మాదిరి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నుంచే సీసీ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాలపై నిఘా ఉంచుతున్నారు. స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీలో కూడళ్ల వద్ద అనుమానితులు, ఆకతాయిల కదలికలను పరిశీలిస్తున్నారు.

డిక్కీ నేరస్తులను పట్టించి..

ఇటీవల పట్టణంలో సంచలనం కలిగించిన డిక్కీ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను గుర్తించడంలో తాపేశ్వరంలోని ఈ సీసీ కెమెరాలు బాగా పనిచేశాయి. తమిళనాడుతో పాటు రాష్ట్రంలోని తిరుపతి, చిలకలూరిపేట, నరసారావుపేట, నెల్లూరు, కోడూరు, వినుకొండ, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లో స్కూటర్ డిక్కీలు పగలుగొట్టి చోరీలకు పాల్పడిన నలుగురు ముఠా సభ్యులను మండపేట పోలీసులు అరెస్టు చేయడం ద్వారా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. మండలంలోని పలు నేరాలకు సంబంధించి నేరస్తుల పట్టివేతలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేశాయి. ఆకతాయిల బెడద ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా స్టేషన్ నుంచే వారిని గుర్తించి తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుంటోంది. సీసీ కెమెరాలకు జడిసి ఆయా ప్రాంతాల్లో ఆకతాయిల బెడద తగ్గిందని స్థానికులు అంటున్నారు. మండలంలోని కేశవరం, ఏడిద, తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూరల్ పోలీసులు తెలిపారు.

పటిష్టంగా సీసీ కెమెరా వ్యవస్థ



జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో మండల గ్రామాల్లో పటిష్టమైన సీసీ కెమెరా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ఏర్పాటులో దాతల సహకారం అభినందనీయం. నైట్ విజన్ క్లియర్‌గా ఉండేలా ఈ కెమెరాలు పనిచేస్తున్నాయి. వీటితో నేరస్తులను త్వరగా పట్టుకోగలుగుతున్నాం. దీంతోపాటు నేరాల సంఖ్య కూడా తగ్గింది.

– బి.శివకృష్ణ, ఎస్ఐ, మండపేట రూరల్

వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

కె.గంగవరం: వరద ఉధృతి వల్ల ఇబ్బంది పడిన వరద బాధితులనే కాకుండా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండలంలోని కోటిపల్లి, శేరిలంక, బ్రహ్మపురి, కోట తదితర గ్రామాలకు చెందిన సుమారు 1920 మత్స్యకార కుటుంబాలకు బుధవారం మంత్రి చెల్లుబోయిన వేణు ప్రభుత్వం అందించిన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏదైనా పథకం అందాలన్నా కాళ్లరిగేలా నాయకులు చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి ఉండేదన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అమలు చేస్తున్న ప్రతి పథకం నేరుగా ఇంటి వద్దకే వచ్చి చేరుతుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి వైపు అడుగుల వేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. వరద బాధితులను తక్షణం ఆదుకోవడానికి కేజీ చొప్పున కంది పప్పు, ఉల్లిపాయలు, నూనె, బంగాళదుంపలు, 25 కేజీల బియ్యంఅందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ..

మండలంలోని కోటిపల్లిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్‌హోం రేషన్ కింద గర్భిణులు, బాలింతలకు మంత్రి చెల్లుబోయిన వేణు రేషన్ సరకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దకే పౌష్టికాహార కిట్లను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ పెమ్మాడి బేబి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లిలో మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు

కాజులూరు: సీఎం జగన్ పాలనలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా గ్రామాల్లో సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని కోలంక సొసైటీ చైర్మన్ తొగరు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్‌లో చైర్మన్‌గా తొగరు చంద్రశేఖర్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా కేవలం పంట రుణాలు మాత్రమే కాకుండా గోల్డ్ లోన్, భూమి అభివృద్ధికి, రైతుల గృహనిర్మాణాలకు, వాహనాల కొనుగోలుకు రుణసదుపాయాలను అందిస్తున్నాయని వాటిని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు డీవీ నరసింహరాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దాట్ల విజయగోపాలరాజు, రైతులు పాల్గొన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది..



వరద తగ్గడంతో బురదమయంగా మారిన ఘాట్ల వద్ద బురద తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి బుధవారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టింది. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరీవాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంతవరకు ఉపశమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల మధ్య వరకు ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో పైనున్న పుష్కరఘాట్‌ల మెట్లు అడుగుమేర బురదమయంగా మారాయి. మత్స్యకార కాలనీలోని మూడు పేటల్లో వరదనీరు తగ్గడంతో ఇళ్లను ప్రజలు శుభ్రం చేసుకుంటున్నారు. గోదావరి ఉధృతి తగ్గినా అటుపై ఉన్న రహదారి కొట్టుకుపోవడం వల్ల పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. నిన్నటి వరకు ఉగ్రరూపం దాల్చిన గోదావరి ప్రస్తుతం ప్రశాంతంగా ప్రవహిస్తుంది. మత్స్యకార కాలనీలో వరద ముప్పు వీడడంతో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు బ్లీచింగ్ చెల్లడం, దోమల మందు స్ప్రే చేయడం వంటి పనులు చేశారు. కాలనీల వద్ద ఇంకా వైద్య శిబిరం కొనసాగుతుంది. వారం రోజులు ఉగ్రరూపం దాల్చిన గోదావరిని చూడడానికి ముంపు గ్రామాల ప్రజలు, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు ఆందోళన కలిగింది. అయితే ఇప్పుడు ప్రశాంతంగా గోదావరిలోని కలిసేందుకు పరవళ్లు తొక్కుతూ కనువిందు చేస్తుంది.

ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి వెంకట్రావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్ రాజ్ తదితరులున్నారు.



కపిలేశ్వరపురంలో వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

స్నేహితుని కుటుంబానికి చేయూత

మండపేట: స్నేహితుని మృతితో తీవ్ర విషాదంలో మునిగిన అతని కుటుంబానికి పూర్వపు విద్యార్థులు బాసటగా నిలిచారు. మండలంలోని ఏడిదకు చెందిన తీగిరెడ్డి శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అతనితో కలిసి పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు రూ.50వేల విరాళాలు సేకరించి అతని కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. గురువారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి డిపాజిట్ పేపర్స్‌తో పాటు రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. పూర్వపు విద్యార్థులు కుసుమంచి బ్రహ్మానంద శ్రీనివాస్, పల్లా సురేష్, వేల్పూరు రవి, పసుమర్తి రామకృష్ణ, కట్టమూరి రామబ్రహ్మం, మేకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుని కుటుంబానికి సాయం అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

రోడ్డుకు మరమ్మతులు

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే ఓఎన్‌జీసీ రోడ్డు మరమ్మతులు వేగవంతంగా జరుగుతున్నాయి. సర్పంచ్ వనుం చిన్నావతి పర్యవేక్షణలో అధికారుల బృందం రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను యంత్రాల సాయంతో తొలగింపు ప్రక్రియను బుధవారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల పాటు తరచూ భారీ వాహనాలు ప్రయాణించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీని వల్ల ఆరోడ్డు వెంబడి రోజు ప్రయాణిస్తున్న విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.మూడు లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పెనికేరు పంచాయతీ పాలవకర్గం సత్వరమే మరమ్మతులను ప్రారంభించింది. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

చోరీల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు

ఆత్రేయపురం: ఇటీవల చోరీలు పెరగడంతో చోరీలు నియంత్రించేందుకు మండల ప్రజల భద్రత కోసం స్థానిక మహిళా పోలీసు, వలంటీర్ల సహాయంతో 15 వేల మందికి పైగా మండల ప్రజల వాట్సాప్ గ్రూపు అను సంధానం చేసి వీడియోస్ రూపంలో అవగాహన చేపడుతున్నట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్థానిక మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి నేరుగా భద్రతా అంశాలపై స్వయంగా అవగాహన కల్పిస్తారన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

మండపేట: రైతుల సంక్షేమానికి, సొసైటీ ఆర్థిక పరిపుష్టికి త్రిసభ్య కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. తాపేశ్వరం సొసైటీకి నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, డైరెక్టర్లు మేడిశెట్టి ప్రసాద్, చిన్ని గంగాధరరావు బుధవారం మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి తదితరులతో కలిసి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియామకంపై ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులను అభినందించారు. సొసైటీ ద్వారా రైతులకు అన్ని విధాల అవసరమైన తోడ్పాటును అందించేందుకు పాటుపడాలన్నారు. పార్టీ నాయకులు తేతలి భూపతిరెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, మండ వెంకటరెడ్డి, తేతలి సాయిబాబారెడ్డి, మండ నాగిరెడ్డి, తేతలి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న విజయభాస్కరరెడ్డి, నాగిరెడ్డి తదితరులు

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులను ఆదేశాలిస్తూ బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, వివిధ శాఖల అధికారులతో కలసి మంత్రి వేణు గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు సాదే రాజేశ్, అనిశెట్టి శ్రీను, గల్లా గంగారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



జగన్నాయకులపాలెంలో డ్రైనేజీ సమస్యను మంత్రి వేణుకు వివరిస్తున్న మహిళ

వల్లూరు వ్యవసాయ సహకార సంఘానికి విశిష్ట అవార్డు

కపిలేశ్వరపురం: వల్లూరులోని శ్రీసత్యనారాయణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి విశిష్ట అవార్డు లభించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో రెండో బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డుకు ఎంపికైనట్టు సహకార సంఘం చైర్మన్ ముత్యాల సతీష్ కుమార్, సీఈఓ వేగుళ్ళ వెంకట రామారావు బుధవారం తెలిపారు. ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవార్డుల ఎంపిక జరిగిందని, ఈ నెల 4న విజయవాడలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి తమకు ఆహ్వానం అందిందన్నారు. సాధారణ సహకార సంఘం విధులతో పాటు రైతులకు వ్యవసాయ, బంగారు రుణాలు మంజూరు చేయడం, సూపర్ మార్కెట్ నిర్వహణ, వేయింగ్ బ్రిడ్జ్ తదితర ఆదాయ, వ్యాపార మార్గాలతో సహకార సంఘం అభివృద్ధి పథాన ముందుకు సాగుతుందన్నారు. వాటి ప్రాతిపదికన అవార్డుకు ఎంపికైనట్టు సతీష్, వెంకటరామారావు తెలిపారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో ఉన్న ఒక మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.15 వేల నగదు సాయాన్ని అందజేసినట్టు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు బుధవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకి చెందిన కుంచే కరుణకుమారి వృద్ధ తల్లిదండ్రులు, తన ఇద్దరు కుమార్తెలతో జీవిస్తోంది. వారందరికీ ఈమే ఆధారం. ఆమెకు అనారోగ్యంతో గర్భసంచిలో ఉన్న కణితి ఇన్ఫెక్షన్ కారణంగా ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించాలని వైద్యులు సూచించారు. ఈ ఆపరేషన్‌కు సుమారు రూ.60 వేల వరకూ ఖర్చవుతుందన్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతుందని ఆమెకు సాయం చేయాలని సేవా సమితి సభ్యులను కోరారు. దీంతో కుమారి వైద్యఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.



బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఈ నెల 6 తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సేవా సమితి సభ్యుడు మన్యం వర్ధనరావు బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కంప్యూటర్ డీసీఏ కోర్సులు నేర్పబడునన్నారు. శిక్షణ తీసుకునే వారు ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక సత్యసాయి సేవాకేంద్రంలో జరిగే అవగాహన సదస్సులో పాల్గొని, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి లంక గ్రామాల్లో నిత్యావసరాల పంపిణీ

కపిలేశ్వరపురం: లంక గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల నివాసితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరుకుల పంపిణీ నిమిత్తం మండలంలోని అధికారులకు ప్రత్యేక విధులను కేటాయించామన్నారు. గురువారం నుంచి ప్రభుత్వం అద్దంకివారిలంక, కేదారిలంక, నారాయణలంక, పల్లపులంక, వీధివారిలంక గ్రామాల్లో ప్రభుత్వం ఉచితంగా సరుకులను పంపిణీ చేయనుందన్నారు. లంక గ్రామాల కార్యదర్శి సీహెచ్ నరసింహారావుతో పాటు సమీప గ్రామాల కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. అద్దంకివరిలంక కార్యక్రమాన్ని అంగర-2, వడ్లమూరు సచివాలయాల కార్యదర్శులు మహమ్మద్ ఆలీ షేక్, గరికిపాటి విజయ్‌కుమార్, కేదారిలంక కార్యక్రమాన్ని వాకతిప్ప, టేకి-2 సచివాలయాల కార్యదర్శిలు కె.యశ్వంత్ కుమార్, ఎస్.శ్రీనివాస్, నారాయణలంక గ్రామ కార్యక్రమాన్ని కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల కార్యదర్శిలు కె.రవితేజ, కె.శంకరమూర్తిలు పర్యవేక్షిస్తారని ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు.

పాడి రైతులకు దాణా పంపిణీ



శేరిలంక రైతులకు దాణా పంపిణీ చేస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: వరద ఉధృతి వల్ల లంక పొలాల్లో పోషణ పొందే పశువులను సంరక్షించి పాడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండలంలోని శేరిలంక పాడి రైతులకు ఉచితంగా సమీకృత పశుదాణాను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరద కారణంగా లంకలో చిక్కుకున్న పశువులను ఇప్పటికే గట్టుకు చేర్చామన్నారు. కోటిపల్లి, కూళ్ల, సుందరపల్లి, మసకపల్లి, బ్రహ్మపురి, కోట గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఏర్పాటు చేసిన వైద్యులను అందుబాటులో ఉంచి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందించి దాణా కూడా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఏడీ రామకృష్ణ, పశువైద్యులు ఎం.కృష్ణార్జున్, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కొండేపూడి భద్రరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..



నారాయణలంకలో పశువుల దాణాను పంపిణీ చేస్తున్న ఏడీఏ అనిత

కపిలేశ్వరపురం: నారాయణలంకలో బుధవారం పాడి రైతులకు పశువుల దాణాను అందజేశారు. వరదలు నేపథ్యంలో పశుగ్రాసం సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం ఉచితంగా పశువుల దాణాను మంజూరు చేసింది. నారాయణలంకలో పశు సంవర్థకశాఖ ఏడీఏ ఎల్.అనిత చేతులు మీదుగా 40 టన్నుల దాణా మిశ్రమాన్ని, 1.53 టన్నుల 51 బేల్స్ ఎండుగడ్డిని పంపిణీ చేశారు. స్థానికంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల సంరక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాడి రైతులు పశు సంవర్థకశాఖ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

కాజులూరు: మండల గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు ఆర్థిక సాయం అందజేసారు. కోలంకకు చెందిన పినిపే సత్యనారాయణ, తనుమళ్లకు చెందిన దార్ల ఎలీసమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ నియోజక ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు బుధవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి డొక్కా సీతమ్మ అసరా పథకంలో భాగంగా పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



డ్రైనేజీల్లో ఎబేట్ స్ప్రే చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

రామచంద్రపురం: ప్రస్తుతం వర్షాకాలం కావటం వ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో పట్టణ ప్రజలు ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో దోమల ఉధృతిని అరికట్టేందుకు ప్రతి బుధ, శుక్రవారాల్లో స్పెషల్ శానిటేషన్‌ను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అందులో భాగంగా మురుగునీరు అధికంగా ఉన్న చోట్ల, డ్రైనేజీల్లో ఎబేట్ స్ప్రేను చేయిస్తున్నామని ఆయన తెలిపారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు బృందాలుగా ఏర్పడి పట్టణంలో దోమల ఉధృతిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వారి వారి ఇళ్ల వద్ద వృథానీటిని నిల్వ ఉంచుకోకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.